సాక్షి
పల్నాడు
శనివారం । 12 । జూలై । 2025



అమ్మవార్లకు ఆషాఢ సారె

భట్టిప్రోలు: వెల్లటూరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ పరివార దేవాలయంలో అమ్మవార్లకు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు.



గౌరీదేవికి లక్ష కుంకుమార్చన

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని శ్రీగౌరీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శతాబ్ది మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన చేశారు.

శాకంబరిగా కాళీమాత



మంగళగిరి: రాజీవ్ గృహ కల్ప రోడ్డులో ఉన్న కాళీ మాత ఆలయంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

జనాభా దినోత్సవ ర్యాలీ



నరసరావుపేట: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని శుక్రవారం జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, ఆరోగ్య కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు. పల్నాడు రోడ్డు మీదుగా గడియారం స్తంభం వరకు వెళ్లి తిరిగి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ర్యాలీ చేరింది. జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ పి.పద్మావతి, స్టాటిస్టికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వర రావు, మాస్ మీడియా ఆఫీసర్ కె.సాంబశివ రావు, జిల్లా మలేరియా ఆఫీసర్ రవీంద్ర రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లు స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలి

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు



నరసరావుపేట రూరల్: విత్తన డీలర్లు విధిగా స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీఏవో మాట్లాడుతూ విత్తన డీలర్లు స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సరుకులు కొనుగోలు చేసినప్పుడు లాట్ నెంబరు బిల్లు పరిశీలించుకోవాలని సూచించారు. విత్తన చట్టం ప్రకారం వ్యాపారం నిర్వహించాలని, చట్టాన్ని అతిక్రమిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ నిల్వలను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారికి తెలియజేయాలని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కేవీ శ్రీనివాస రావు, ఏవో ఐ.శాంతి పాల్గొన్నారు.

గురజాల తహసీల్దార్ సస్పెన్షన్

గురజాల: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వైవీ కుటుంబ రావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ రావు గతంలో దాచేపల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సమయంలో కేసానుపల్లి, పెదగార్లపాడు, భట్రుపాలెం, గామాలపాడు గ్రామాల్లో ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ మాసంలో దాచేపల్లి మండలం నుంచి ఆయన గురజాలకు బదిలీపై వచ్చారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం



కొరిటెపాడు(గుంటూరు): ప్రధాన మంత్రి సూర్య ఘర్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి ఆదేశించారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవనం ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్ సిబ్బంది, ఉద్యోగులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ లో వోల్టేజ్ సమస్యలను అధిగమించి, ప్రజలకు నిరంతర విద్యుత్ అందించాలని ఆయన సూచించారు. బకాయిలపై దృష్టి పెట్టాలని, ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు సహస్ర దీపాలంకరణ



మంగళగిరి: పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ ఉత్సవానికి కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కొప్పురావూరి లక్ష్మీశ్రీనివాసరావు దంపతులు వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ప్రజలను వంచించిన బాబు

- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'పై సమీక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు
- సీఎం చేసిన దగాను ఇంటింటికీ వెళ్లి వివరించాలని శ్రేణులకు దిశానిర్దేశం
- పార్టీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా



'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వినుకొండ: ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ ముఖ్య నేతలు సూచించారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' అనే కార్యక్రమంపై నియోజక వర్గ స్థాయిలో సమీక్ష సమావేశం పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఉన్న బొల్లా కన్వెన్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పల్నాడు జిల్లా పరిశీలకులు పూనూరు గౌతంరెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. కష్టపడ్డ వారిని గుర్తు పెట్టుకుంటామని చెప్పారు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను నమ్మించి నిండా ముంచారన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను సైతం మోసం చేశారని ఆరోపించారు. వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సొంత గ్రామానికి కూడా రోడ్డు వేసిన ఘనత బ్రహ్మనాయుడుకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ వేధింపులతో ఐపీఎస్‌లు కూడా రాజీనామాలు చేస్తున్నారన్నారు. అన్నివర్గాల్లోనూ ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. రానున్న రోజుల్లో కష్టపడిన వారిని గుర్తుపెట్టుకొని తగిన పదవులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఇంతమంది నాయకులు అండగా ఉన్నారని గుర్తుచేశారు. కార్యకర్తలకు కష్టం వస్తే తానే ముందుంటానని చెప్పారు. అవసరమైతే ప్రాణాలైనా అర్పిస్తానని అన్నారు. వినుకొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలను మోసగించిన బాబు

కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వినుకొండలో హత్యా రాజకీయాలు ప్రారంభించారని ధ్వజమెత్తారు. గ్రామాల్లో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. చంద్రబాబు హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే.. ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

సీఎంను పవన్ ప్రశ్నించాలి

మోదుగుల వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ.. పల్నాడు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి శ్రేణులకు సహాయ, సహకారాలు అందజేస్తామని చెప్పారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలను ఇంకా బాగా అమలు చేస్తానని చెప్పి సీఎం చంద్రబాబు సిగ్గు లేకుండా అన్ని వర్గాలను మోసం చేసినట్లు గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్ ఇప్పటికైనా బాబును ప్రశ్నించాలన్నారు.

వైఎస్ జగన్‌పై అదే నమ్మకం

పూనూరు గౌతం రెడ్డి మాట్లాడుతూ... ఇచ్చిన మాట నిలబెట్టుకునే నేతగా ఇప్పటికీ వైఎస్ జగన్‌పై ప్రజల్లో ఆదరణ ఉందని అన్నారు. దివంగత మహానేత రాజశేఖర రెడ్డి తనయుడుగా రాజకీయాల్లో నమ్మకానికి మారుపేరుగా వైఎస్ జగన్ ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అన్నివిధాలా ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సీఎంకు చెంచాలుగా ఐపీఎస్‌లు

- రౌడీల్లా వ్యవహరిస్తున్న పలువురు పోలీసు ఉన్నతాధికారులు
- అడ్డగోలు కేసులు పెడితే కోర్టు ద్వారా న్యాయపోరాటం చేస్తాం
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ తదితరులు

సత్తెనపల్లి: కొందరు ఐపీఎస్ అధికారులు సీఎం చంద్రబాబుకు చెంచాలుగా వ్యవహరిస్తూ రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. బంగారుపాళ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులపై, కార్యకర్తలపై, రైతులపై, అభిమానులపై రౌడీషీట్ పెడతానని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ బెదిరించడాన్ని ఖండించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన అనంతరం ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ... చిత్తూరు ఎస్పీ మణికంఠ, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠిలు చంద్రబాబుకు చెంచాలేనని ఆరోపించారు. వీరు కాకుండా మరికొంత మంది రిటైర్డ్ అయిన వారు కూడా ఇదే తీరులో మద్దతుగా ఉన్నారన్నారు. వీరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఇది అక్రమమన్నారు. పోలీసులు ఎన్ని నోటీసులు ఇచ్చినా సమాధానం చెబుతామని, కోర్టులో వారి సంగతి తేలుస్తామని పేర్కొన్నారు. కేవలం హరీష్ కుమార్ వర్సెస్ బిహార్ అనే కేసును ఫాలో కాకుండా చేసిన అందరు ఎస్పీల మీద, అందరు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ల మీద కేసులు పెడతామని హెచ్చరించారు. ఎవర్నీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎస్పీ మణికంఠ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరంగానే ఆయన అంతు తేలుస్తామన్నారు. తల్లికి వందనం పథకం లోకేష్ ఆలోచన అని చంద్రబాబు చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన అమ్మ ఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం అని పెట్టారన్నారు.

కూటమికి గుణపాఠం తప్పదు...

ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ తమకు కేసులు, పోరాటాలు కొత్తేమీ కాదన్నారు. ఇందిరాగాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు తెచ్చేలా, నల్లచట్టాలు తీసుకొచ్చి అణచివేయడానికి, నిర్బంధించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని తెలిపారు. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా ఓటుతో ప్రజలు కూటమికి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. గుంటూరులో రెండు, సత్తెనపల్లిలోనూ అక్రమ కేసులు పెట్టారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలనే ఆలోచన మాత్రం ప్రభుత్వానికి లేదన్నారు. మిర్చి, పొగాకు, మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లినందుకే కేసులు పెట్టారన్నారు. వ్యవసాయం దండగ అనేది చంద్రబాబు వైఖరి అని వ్యాఖ్యానించారు. అందుకే రైతులను అణగదొక్కడానికి పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. ఎవరైనా నోరెత్తితే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

భయపడేదే లేదు...

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ... తమకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ జన సమీకరణ చేశామని పేర్కొంటూ తప్పుడు కేసు పెట్టారన్నారు. తమను అణచివేయాలని, భయపెట్టాలనే ఇలాంటి ప్రయత్నం సరికాదన్నారు. పొన్నూరులో ఒక దళిత సర్పంచ్‌పై, అదీ 60 ఏళ్లుగా రిజర్వేషన్ లేకుండానే రాజకీయంగా పలు పదవులు సొంతం చేసుకున్న కుటుంబంలోని వ్యక్తిపై హత్యాయత్నం చేయించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రమేయంతో అక్కడ కూడా కేసు పెట్టినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి కేసులకు తాము భయపడేదే లేదన్నారు.


అక్రమ కేసులతో వేధించేందుకు కుట్ర

- టీడీపీ నేతల విభేదాలతో జరిగిన జంట హత్యల కేసును నాపై వేశారు
- అసత్య ఆరోపణలు చేసిన పేపర్‌పై న్యాయ పోరాటానికి సిద్ధం
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి తనపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తోందని, వాటిపై న్యాయపోరాటం చేస్తున్న నేపథ్యంలో కొత్త కుట్రలకు తెరదీస్తున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా మాచర్లలో అక్రమ మైనింగ్ జరిగిందంటూ పచ్చ పేపర్లలో వస్తున్న అసత్య ప్రచారాలపై ఆయన స్పందించారు. ఇప్పటికే తనపై అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. చివరకు తెలుగుదేశం పార్టీలో అంతర్గత కలహాల వల్ల వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జంట హత్యలు జరిగితే తనపై అక్రమ కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసులో బెయిల్ వస్తుందేమోనన్న అనుమానంతో అక్రమ మైనింగ్ అంటూ కొత్త కుట్రలకు తెరలేపారన్నారు. ఆ మైనింగ్‌తో తనకెలాంటి సంబంధం లేదన్నారు. అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి తనను ఇరికించాలని చూస్తున్నారన్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం, జూలకంటి బ్రహ్మారెడ్డిలు మాచర్లలో చెప్పుకోవడానికి ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తాను చేసిన అభివృద్ధిని పక్కదోవ పట్టించేందుకు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజాభిమానాన్ని ఓర్వలేక జాతీయ రహదారి నిర్మాణానికి అక్రమ మైనింగ్ మట్టి వాడారంటూ కొత్త ప్రచారానికి తెరదీశారన్నారు. ఆంధ్రజ్యోతిలో తనపై కావాలనే నిరాధార కథనాలు ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పత్రిక యాజమాన్యంపై హైకోర్టులో పరువునష్టం దావా వేస్తామన్నారు. తనపై రోజుకో అసత్య ఆరోపణ తెరపైకి తెచ్చి వార్తలు రాస్తున్నారని, వారిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. కుట్రలకు భయపడేది లేదని చెప్పారు. ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తానన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ కమిటీ నియామకం



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా యువజన విభాగ కమిటీని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉపాధ్యక్షులుగా సయ్యద్ జబీర్(గురజాల), దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి (మాచర్ల), ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి అశోక్‌కుమార్ (నరసరావుపేట), భీమాని అంకారావు (వినుకొండ), ఇల్లూరి వెంకటరామి రెడ్డి (గురజాల), నిమ్మా రాము (పెదకూరపాడు), యాసరపు బాబు (సత్తెనపల్లి), కార్యదర్శులుగా కోట చినబాబు (నరసరావుపేట), మాచర్ల పవన్ కుమార్ (మాచర్ల), గోపు ఆంతోని రెడ్డి (పెదకూరపాడు), గాదె సత్యనారాయణ రెడ్డి (వినుకొండ), దాట్ల విక్రమ నరసింహ వర్మ (చిలకలూరిపేట), కంఠమనేని రామచంద్ర రావు (సత్తెనపల్లి), బైరెడ్డి బసవి రెడ్డి (మాచర్ల) నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నూలే అంకి రెడ్డి, అత్తర్ నాగూర్ వలి, షేక్ ఖాదర్ బాషా (వినుకొండ), బత్తుల సంజీవ రావు, పి.చిన్న రాజా (మాచర్ల), వజ్రాల శ్రీనివాస రెడ్డి, మైనేని ప్రతాపకుమార్, షేక్ బాజి (పెదకూరపాడు), ఎం.జయప్రకాష్ రెడ్డి, ఐ.దేశిబాబు (సత్తెనపల్లి), ఎం.డి.ఉస్మాన్, డి.జోజి బాబు, లకావత్ చిన దుర్గానాయక్, కత్తి రత్నశేఖర్ (చిలకలూరిపేట), షేక్ సైదా, పాతర్ల చిన్ని (నరసరావుపేట), చల్లా రంగారెడ్డి (గురజాల) నియమితులయ్యారు.

పీ4కు మార్గదర్శకులను గుర్తించండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం కింద మార్గదర్శకులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమంపై సీపీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15 నాటికి అర్హత కలిగిన కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. మార్గదర్శకుల కోసం అధికారులు తమ పరిధిలో వచ్చే సోమ, మంగళవారంలోపు ఆయా శాఖల పరిధిలో స్టాక్ హోల్డర్లతో సమావేశాల నిర్వహణ పూర్తిచేయాలన్నారు. జిల్లా అధికారులందరూ ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు కార్యక్రమంపై గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు ఎంపిక చేసిన బంగారు కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు.

హైవే బాధితులకు న్యాయం చేయండి

- ఉప్పలపాడు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించండి
- ఎన్‌హెచ్‌ఏఐ పీడీకి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచన



ఉప్పలపాడు గ్రామం వద్ద డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో పీడీకి తమ ఇబ్బందులు చెబుతున్న మహిళలు

నరసరావుపేట: వినుకొండ-గుంటూరు నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న ఉప్పలపాడు గ్రామస్తులు, పట్టణ ప్రాంతవాసులకు తగిన న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ హైవే పనులపై అభ్యంతరాలను స్వీకరించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామస్తులు, పట్టణ ప్రాంతవాసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి బాధితులకు మద్దతుగా డాక్టర్ గోపిరెడ్డి హాజరయ్యారు.

నష్టం తగ్గేలా భూసేకరణ చేపట్టాలి

దీనిపై డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ.. మొత్తం 80 కిలోమీటర్ల రోడ్డు పొడవులో ఉప్పలపాడు గ్రామ విస్తీర్ణం అధికంగా ఉందన్నారు. రోడ్డును ఆనుకొని ప్రజలు నివాసం ఉండటం వలన భూసేకరణతో ఎక్కువ మంది విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నారన్నారు. అవకాశం ఉంటే ఉప్పలపాడు వద్ద బైపాస్ నిర్మాణం చేపట్టి నష్టాన్ని తగ్గించాలని కోరారు. ఉప్పలపాడు నుంచి ఎస్ఆర్‌కేటీ సెంటర్ వరకు ఐదు కిలోమీటర్ల దూరంలో రోడ్డుకు ఒకవైపే భూసేకరణ కారణంగా అనేకమంది గృహాలు, మిల్లులు, వాణిజ్య సముదాయాలు కోల్పోతున్నారన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొంది ఆ డబ్బులతో ఇళ్ల నిర్మాణం చేసిన వారు కూడా ఇక్కడ ఉన్నారన్నారు. జగనన్న కాలనీలో సుమారు ఆరు వేల మందికి ప్లాట్లు ఇచ్చారని, 500 మంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారని గుర్తుచేశారు. ఈ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా భూమి సేకరిస్తే నష్టం తగ్గుతుందన్నారు. డాక్టర్ గోపిరెడ్డితో పాటు పార్వతీశం, గ్రామస్తులు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ కరిముల్లా, డాక్యుమెంట్ రైటర్ మోహనరెడ్డి, రామాంజనేయరెడ్డి, పెద్దిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చాకే పనులు

పీడీ పార్వతీశం మాట్లాడుతూ.. మొత్తం 80 కిలోమీటర్ల పొడవైన హైవేలో 45 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయిందన్నారు. ఐదు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) నిర్మాణాలు అవసరం అవుతాయని చెప్పారు. వచ్చే డిసెంబర్ లేదా మార్చిలోపు టెండర్ పిలవనున్నట్లు పేర్కొన్నారు. భూ సేకరణపై ఎస్ఎస్‌పీ, చిన్న నీటి పారుదల శాఖల అధికారుల అభ్యంతరాలను తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన నూతన మార్గదర్శకాల మేరకు భూములు సేకరిస్తామని తెలిపారు. పరిహారం చెల్లించిన తర్వాతే పనులు మొదలు పెడతారన్నారు. రైటాఫ్ వే పద్ధతిని అనుసరించి 40 మీటర్లకు పైగా భూమి సేకరించనున్నట్లు వివరించారు. ఈ రోడ్డు మార్గంలో రోడ్డు వంకర తిరిగిన శావల్యాపురం, పెట్లూరివారిపాలెం గ్రామాల వద్ద బైపాస్ నిర్మాణం చేస్తారని చెప్పారు. ఉప్పలపాడు వద్ద రోడ్డు సక్రమంగా ఉండటం వలన బైపాస్ నిర్మాణం ప్రతిపాదించలేదని అన్నారు.

సమన్వయంతో శంకర్‌విలాస్ వంతెన పనులు



గుంటూరు వెస్ట్: గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ నూతన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సమన్వయంతో వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు కోసం ప్రత్యామ్నాయ రహదారులు సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇప్పటికే తొలగించిన ఆక్రమణలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు

సహకరించిన ప్రియుడికి కూడా శిక్ష

నరసరావుపేట టౌన్: ప్రియునితో కలిసి భర్తను హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితురాలు వినుకొండకు చెందిన శ్రీగిరి స్వాతి, ఆమె ప్రియుడు పట్టేపురం మారుతీబాబులకు జీవిత ఖైదు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలు.. శ్రీగిరి కుమార్ (38)తో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం బయ్యారం గ్రామానికి చెందిన స్వాతికి వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. స్వాతికి వినుకొండకు చెందిన పట్టేపురం అలియాస్ రాజారపు మారుతీబాబుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంపై కుటుంబంలో కలహాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో 2023 ఫిబ్రవరి 11వ తేదీన కుమార్ మద్యం మత్తులో ఇంట్లో నిద్రిస్తుండగా స్వాతి, మారుతీబాబు కలిసి కుమార్ మెడకు తాడు బిగించి హతమార్చారు. కుమార్ తల్లి మేరీ రోజ్లిన్ దీనిపై వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు. ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పర్యవేక్షణతో సత్ఫలితాలు

నరసరావుపేట రూరల్: ట్రయల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణతో సత్ఫలితాలు వస్తున్నాయని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. వినుకొండలో 2023 జరిగిన హత్య కేసులో నిందితులకు శుక్రవారం న్యాయస్థానం జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధించింది. నిందితులైన శ్రీగిరి స్వాతి, ఆమె ప్రియుడు మారుతీబాబులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. అప్పటి వినుకొండ సీఐ బి.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారని, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. ట్రయల్ మానిటరింగ్ ద్వారా నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో సాక్షులను ప్రవేశపెట్టారన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,600



పసుపు ధరలు (శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 834

కొమ్ములు : 509 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,281	10,050

కాయలు : 325 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,300	10,050

మొత్తం అమ్మకాలు : 625.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	35,320
అమ్మకాలు	39,226
నిల్వ	3,208

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,300
341	10,000–13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,700
నంబరు–5	10,000–13,400
341	10,000–13,500
4884	10,000–12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,500
బాడిగ–355	10,000 – 12,500
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 11,000
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,400
బాడిగ – 355	10,000–12,600
దేవనూరు డీలక్స్	10,000 – 12,500
తాలు	5,200 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

కాలువ మరమ్మతుల్లో డొల్లతనం



ఆకురాజుపల్లి కెనాల్ వద్ద తొలగించని ముళ్ల కంప మొదళ్లు



కాలువలోకి జారుతున్న మట్టి

- ఆకురాజుపల్లి మేజర్ కెనాల్ పనుల్లో నిర్లక్ష్యం
- ముళ్లకంపను పూర్తిగా తొలగించని వైనం
- రూ. 2.17 కోట్లతో కొనసాగుతున్న పనులు
- అధికారులు తనిఖీ చేయాలని రైతుల వినతి

పిడుగురాళ్ల: పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులను ప్రారంభించింది. ఈ క్రమంలోనే గురజాల నియోజకవర్గంలోని 37 నీటి సంఘాలకుగాను 31 సంఘాలకు సంబంధించి కాలువల కోసం రూ. 2.17 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మొత్తం ఈ ప్రాంతంలో సుమారు 220 కిలో మీటర్ల మేరకు మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. 100 కిలో మీటర్ల కోసమే నిధులు వచ్చాయి. అందులో భాగంగా పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోని 9 నీటి సంఘాలకుగాను 8 సంఘాలలోని కాలువలకు సుమారు 35 కిలోమీటర్ల మేర పనులకు రూ. 79 లక్షలు కేటాయించారు.

అరకొరగా పనులు

ఆకురాజుపల్లి మేజర్ కెనాల్ కింద ఉన్న పెద్ద కాలువ పనులలో డొల్లతనం కనిపిస్తోంది. ముళ్ల పొదలు ఎక్కువగా ఉన్న ఈ కాలువకు ఇరువైపులా జేసీబీతో ముళ్ల పొదలు తొలగించారు. కానీ ఆ మొదళ్లు తొలగించలేదు. దీంతో ఒక్క వర్షం పడితే అవి వెంటనే మొలకెత్తుతాయి. నెల గడవగానే ఏపుగా పెరిగే అవకాశం ఉంది. రైతులు రాత్రి సమయాల్లో అటుగా వస్తే ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువలకు ఇరువైపులా ఏటవాలుగా మట్టిని పోశారు. అది కిందకు జారకుండా గట్టిగా అదమాల్సి ఉంటుంది. అలా చేయకపోవటంతో తిరిగి కాలువలోనే పడిపోతోంది. దీనివల్ల నీటి ప్రవాహానికి ఇబ్బందులు తప్పవు. రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. అధికారుల పర్యవేక్షణ లేక గుత్తేదారులు అడ్డగోలుగా పనులు చేస్తున్నారు. రైతులు ఈ విషయం ప్రస్తావించిన పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలని, పనుల్లో నాణ్యత పెంచాలని రైతులు కోరుతున్నారు.

జాస్తి వీరాంజనేయులుకు జాతీయ పురస్కారం

అమరావతి: మండల పరిధిలోని పెదమద్దూరుకు చెందిన అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు నేషనల్ ఐకాన్ పురస్కారాన్ని అందుకున్నారు. గురువారం రాత్రి ఢిల్లీలో ప్రధానమంత్రి సంగ్రహాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలే, ఉత్తరప్రదేశ్ మంత్రి రఘురాజ్ సింగ్, మాజీ మంత్రి సతీష్ చందు దివేది చేతులమీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. సామాజిక సేవలకుగాను ఢిల్లీలోని బీవై సంక్షేమ సంఘం, భారత్ టీవీ సంయుక్తంగా ఈ అవార్డు ప్రకటించాయి. వీరాంజనేయులును శుక్రవారం పెదమద్దూరు గ్రామస్తులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

స్థానిక సంస్థలకు నిధులివ్వండి

ఏపీలో స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ రామ్ ప్రతాప్‌కు శుక్రవారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం ఢిల్లీలోని కార్యాలయంలో ఆయన్ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. గత డిసెంబర్‌లో కేంద్రం పంపిన రూ.1,121 కోట్ల నిధులు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికీ స్థానిక సంస్థలకు విడుదల చేయలేదన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.



అవార్డు స్వీకరిస్తున్న దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన నూతన జిల్లా అధికారులు





కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ గీతారాణి, ఆర్టీసీ ఆర్ఎం అజిత్ కుమారి

నరసరావుపేట: ఆర్టీసీ ఆర్ఎంగా నియమితులైన జి.అజిత్‌కుమారి, ఆర్అండ్‌బి ఇఇ గీతారాణి వేర్వేరుగా శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియామకాలను గురించి ఆయనకు వివరించారు. బాధ్యతగా పనిచేసి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని వారికి కలెక్టర్ సూచించారు.

అనుగురాజు కాంస్య విగ్రహానికి రూపకల్పన

- పిడుగురాళ్లలో ప్రతిష్ట నిమిత్తం రూపొందించిన తెనాలి శిల్పులు
- 12వ శతాబ్దంలో పల్నాడును పాలించిన అనుగురాజు
- 700 కిలోల కంచుతో తొమ్మిది అడుగుల నిలువెత్తు విగ్రహం

తెనాలి: పన్నెండో శతాబ్దంలో పల్నాడును పరిపాలించిన అనుగురాజు విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలు రూపొందించారు. ఆయన చరిత్రకు సంబంధించిన ఫొటోలు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, విగ్రహ కమిటీ సూచనతో శిల్పకారులు పలు డ్రాయింగులు, కంప్యూటర్ డిజైన్లను తయారుచేశారు. ఆ ప్రకారం తొమ్మిది అడుగుల నమూనాను తయారుచేసి కమిటీ సంతృప్తిని వ్యక్తంచేశాక 700 కిలోల కాంస్యాన్ని వినియోగించి అనుగురాజు విగ్రహాన్ని సిద్ధం చేశారు. చారిత్రక ఆధారాల ప్రకారం అనుగురాజు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ ప్రాంతం నుంచి వచ్చి పల్నాడును పరిపాలించారు. ఆయన శరీరాకృతి, వస్త్రధారణను ఊహించి విగ్రహాన్ని రూపొందించామని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర చెప్పారు. ఈ విగ్రహాన్ని పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో గంగమ్మతల్లి గుడి ఎదురుగా ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ కమిటీ సభ్యులు, అనుగురాజు యాదవ్ అభిమానులతో గురువారం ఆ విగ్రహాన్ని పల్నాడుకు తీసుకువెళ్లారు.



అనుగురాజు కాంస్య విగ్రహంతో శిల్పులు, విగ్రహ కమిటీ సభ్యులు

మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అధికార ప్రతినిధిగా సంగీతరావు



సత్తెనపల్లి: మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధికార ప్రతినిధిగా బొక్కా సంగీతరావు ఎన్నుకున్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎల్ఎఫ్ రాష్ట్ర ఇన్‌చార్జి, సీనియర్ న్యాయవాది పూసులూరి జీవా అధ్యక్షతన గుంటూరులో జరిగిన సమావేశంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది బొక్కా సంగీతరావుని ఉమ్మడి గుంటూరు (గుంటూరు, బాపట్ల, పల్నాడు) జిల్లా అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంగీతరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారం దిశగా పనిచేస్తానన్నారు. మాదిగల 30 ఏళ్ల చిరకాల కోరిక ఎస్సీ వర్గీకరణ కూటమి ప్రభుత్వంలో నెరవేరడం మాదిగ జాతి ప్రజల అదృష్టమన్నారు. అందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరు నెలలైనా అందని 'ధాన్యం' నగదు

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని గుంటుపాలెం గ్రామానికి చెందిన నలుగురు రైతులు జనవరి 30వ తేదీన లారీ ధాన్యం ప్రభుత్వ మద్దతు ధరకు రైతు సేవా కేంద్రం మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో విక్రయించారు. రైతులు కమతం సుబ్బారావు –166 బస్తాలు, నారు వెంకటరెడ్డి –87 బస్తాలు, మద్దినేని చిన ఆంజనేయులు–38 బస్తాలు, అన్నవరపు బ్రహ్మం–40 బస్తాలు రూ.1,740కు అమ్మినట్లు రైతులు తెలిపారు. రైతు సేవా కేంద్రం నుంచి చిలుకలూరిపేట గాజుల బ్రదర్స్ రైస్ మిల్లుకు వ్యవసాయ అధికారులు లారీ ధాన్యాన్ని పంపించారు. నలుగురు రైతులకు సంబంధించి రూ.5.84 లక్షల నగదు కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నెలలు గడుస్తున్నా నేటి వరకు ధాన్యం నగదు రాకపోవటంతో రైతులు మండిపడుతున్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులకు తెలిపినా ఫలితం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ధాన్యం నగదు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు విలేకర్ల సమావేశంలో శుక్రవారం కోరారు.

తిరువూరు సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

తిరువూరు: తిరువూరు సబ్ రిజిస్ట్రార్ బాణోతు జగన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మూడు రోజుల క్రితం ఆయనను సస్పెండ్ చేసిన అధికారులు సమాచారం బయటికి పొక్కకుండా గుట్టుగా ఉంచారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి నానికి తుళ్లూరులో 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఆయన ప్రమేయం లేకుండా శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తి మరొకరికి విక్రయించినట్లుగా తిరువూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' విధానంలో సబ్ రిజిస్ట్రార్ జగన్ ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై కోవెలమూడి నాని రిజిస్ట్రేషన్ శాఖకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం తిరువూరు సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. తొమ్మిది నెలల క్రితం తిరువూరు సబ్ రిజిస్ట్రారుగా వచ్చిన జగన్ ఇదే తరహాలో కొందరు దస్తావేజు లేఖరులు, దళారులు, ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన దస్తావేజులను ఇష్టానుసారం రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయంలో ఏ పనికైనా బహిరంగంగానే అదనపు డబ్బు వసూలు చేసినట్లు కక్షిదారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపితే తిరువూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అక్రమాలు వెలికి వచ్చే అవకాశం ఉంది.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

నాదెండ్ల: ఓ యంత్ర పరికరాన్ని దిగుమతి చేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా చిరువూరు మండలం, వావిలాల గ్రామానికి చెందిన దంతాల వీరభద్రరావు (67) చిలకలూరిపేటలో లారీ ట్రైలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నరసరావుపేటలో ఓ యంత్ర పరికరాన్ని లోడ్ చేసుకుని గణపవరం గ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం కూలీలు రాకపోయేసరికి ఉదయం 10 గంటలకు ట్రైలర్ యజమానికి ఫోన్ చేసి తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పాడు. సమీపంలోని దుకాణంలో గ్యాస్ తగ్గడానికి పౌడర్ ప్యాకెట్ తీసుకుని నీటిలో కలిపి తాగాడు. లారీలో విశ్రాంతి తీసుకున్నాడు. 11.30 గంటల సమయంలో ట్రైలర్ యజమాని ఫోన్ చేయగా వీరభద్రరావు ఫోన్ స్విచాఫ్‌లో ఉంది. దీంతో యజమాని అక్కడకు చేరుకుని చూడగా, వీరభద్రరావు లారీలో మృతి చెంది కనిపించాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై జి.పుల్లారావు మృతుడి కుమారుడితో ఫోన్‌లో మాట్లాడారు. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపారు. గుండెపోటు కారణంగా వీరభద్రరావు చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.



లారీ క్యాబిన్‌లో వీరభద్రరావు మృతదేహం

బావమరిది దాడిలో బావ మృతి

చేబ్రోలు: అక్క బావల మధ్య జరుగుతున్న వివాద విషయం తెలుసుకున్న బావమరిది అక్కడకు వెళ్లి బావతో గొడవ పడి క్షణికావేశంలో కర్రతో తలపై దాడి చేసి గాయపరచటంతో మరణించిన సంఘటన చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండవరం గ్రామానికి చెందిన నన్నపనేని కృష్ణబాబు (35)కు అదే గ్రామానికి చెందిన మక్కే భువనేశ్వరితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇరువురు మగ పిల్లలు ఉన్నారు. వారం రోజుల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా గొడవ పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో భార్యాభర్తలైన కృష్ణబాబు, భువనేశ్వరిల మధ్య వివాదం జరుగుతుండటంతో భువనేశ్వరి తమ్ముడు గోపికి ఫోన్ చేసి గొడవ జరుగుతున్న విషయాన్ని తెలియజేసింది. మక్కే గోపికి అక్కాబావల ఇంటికి వచ్చి గొడవ విషయం గురించి మాట్లడుతుండగా బావ బావమరిదిల మధ్య మాటమాట పెరగటంతో క్షణికావేశంలో గోపి బావను సమీపంలో ఉన్న పెద్ద కర్రతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలై పడిపోయాడు. బంధువులు తీవ్ర గాయాలైన కృష్ణబాబును వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుని తల్లి నన్నపనేని వీరకుమారి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణబాబు మృతదేహం

మధ్యాహ్న భోజనం పరిశీలించిన డెప్యూటీ డీఈఓ

నకరికల్లు: విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డెప్యూటీ డీఈఓ ఏసుబాబు హెచ్చరించారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేదని గురువారం తల్లిదండ్రులు ఆందోళన చేసిన నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి చూశారు. నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నభోజనం నిర్వాహకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. వంట వండేముందుగా బియ్యం, కూరగాయలు నాణ్యతను పరిశీలించుకున్నాక వండాలన్నారు. వంటగదులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మరోసారి నాణ్యత లోపించినా, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.పుల్లారావు, జాలాది శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సహోద్యోగి కుటుంబానికి అండగా కానిస్టేబుళ్లు

రూ.1.58 లక్షలు సమకూర్చిన మిత్రులు



చీరాల: సహోద్యోగి అకాల మరణంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు తాము న్నామంటూ కానిస్టేబుళ్లు ముందుకు వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ బిల్లా రమేష్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి పోలీస్ సిబ్బంది అందరూ కలిసి రూ.1.58 లక్షలను సమకూర్చారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మోయిన్ శుక్రవారం వేటపాలెంలోని బిల్లా రమేష్ ఇంటికి వెళ్లి వృద్ధాప్యంలో ఉన్న అతని అమ్మమ్మకు నగదును అందించారు. డీఎస్పీ మాట్లాడుతూ రమేష్ చిన్న తనంలోనే తల్లిని కోల్పోయాడని, అమ్మమ్మ దాసరి సుబ్బులు అన్ని బాధ్యతలు తీసుకుని పెంచి పోషించిందని తెలిపారు. రమేష్ అకాల మరణంతో కష్టకాలంలో 2009 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన అతడి మిత్రులు నగదును సమకూర్చారని చెప్పారు. ఇది ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

అస్మదీయుడికి నామినేటెడ్ పదవి

వేమూరు: కూటమి ప్రభుత్వంలో భూ కబ్జాదారులకు నామినేటెడ్ పదవులు లభించడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేమూరు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్‌కు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా పదవి కట్టబెట్టడంపై పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. చావలి గ్రామానికి చెందిన ఆయన మెయిన్ సెంటరులో ప్రభుత్వం భూమి కబ్జా చేసినట్లు గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అందులో ఏర్పాటు చేసిన చికెన్ స్టాల్ తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినా రాజేష్ పట్టించుకోలేదు. చికెన్ స్టాల్ తొలగించకుండా ప్రభుత్వ అధికారులు, గ్రామస్తులపై కోర్టుకు వెళ్లాడు. ఇది కాకుండా గ్రామంలోని చెరువు స్థలం కూడా ఆక్రమించుకుని, రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీన్ని కొల్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తప్పుడు సర్వే నంబర్ వేసి భార్యపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. పైగా భవనంపై ప్రైవేటు ఫైనాన్స్ నుంచి రుణాన్ని కూడా తీసుకున్నట్లు గ్రామంలో గుసగుసలు విన్పిస్తున్నాయి. భూ కబ్జాలతో పాటు రాజేష్ ఏప్రిల్ 24న దళిత యువకుడిపై చెప్పుతో దాడి చేశాడు. దీనిపై ఎస్సీ ఎట్రాసిటీ కేసు కూడా నమోదైంది. ఇటువంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం నామినేటివ్ పదవి ఇవ్వడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీకి నష్టం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పైకి జనసేన నేతలు సిద్ధాంతాలు చెబుతూ, లోపల భూకబ్జాదారులకు పదవులు ఇస్తోందని విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలని, పార్టీ కోసం పని చేసిన వ్యక్తులను గుర్తించి పదవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాశ్

రేపల్లె: హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.సూర్యప్రకాశ్ విమర్శించారు. పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించింది. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ హాస్టల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 618 మంది విద్యార్థినులు ఉన్న గురుకులంలో ఆర్వో ప్లాంట్ పనిచేయక తాగునీటి కోసం అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. మోటర్ పనిచేయక పోవడంతో స్నానాలు, ఇతర అవసరాలకు కింద నుంచి మూడవ అంతస్తు వరకు నీటిని మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. ఫిబ్రవరిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు వసతి గృహాన్ని సందర్శించిన సమయంలో ఆయా సమస్యలను విద్యార్థినులు ఆయనకు వివరించారని గుర్తు చేశారు. వారం రోజుల్లో ఆర్వో ప్లాంట్ బాగు చేయిస్తామని, నిధులు వెంటనే కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించి నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటని ఖండించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కేవీ లక్ష్మణరావు, బాలికల విభాగం కన్వీనర్ కె.భవాని, పి.నిఖిత, వై.నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి వై.ఎస్.రావు

బాపట్ల టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎంప్లాయీస్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ కార్యదర్శి వైఎస్ రావు తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణంలో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైఎస్ రావు మాట్లాడుతూ 74 సంవత్సరాలుగా ఎంప్లాయీస్ యూనియన్ ఆర్టీసీ కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతోపాటు వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఉద్యోగులకు కావాల్సిన సౌకర్యాలు, వారికి రావలసిన రాయితీలు, ఉద్యోగులకు అందించే ప్రయోజనాల కోసం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాపట్ల డిపో కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ క్యాజువల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయించడంలో, సమాన పనికి సమాన వేతనం ఇప్పించడంలో, యూనిఫాం ఇప్పించడం, వైద్య సౌకర్యాలు అందించడంలో ఎంప్లాయిస్ యూనియన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల డిపో అధ్యక్షులు టి.చంద్రశేఖర్, టి.యస్. నారాయణ, ఎం.కోటేశ్వరరావు గ్యారేజ్ సెక్రటరీ చలపతి, సి.సి.ఎస్. డెలిగేట్ ఎం.పి.కుమార్, సీనియర్ సభ్యుడు ఐ.యస్.రావు, బాపట్ల జిల్లా ఏపీ జేఏసీ అమరావతి మహిళా చైర్ పర్సన్ పి.రజిని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ కార్యదర్శి వైఎస్ రావు